# పీసీసీ నేతలు దొంగల ముఠాగా మారారు..

## భాగాలు పంచుకుని సీట్లు అమ్ముకున్నారు

- వీళ్లను నమ్మితే రాష్ట్రాన్నే అమ్ముకుంటారు.. నమ్ముకున్న వాళ్లను నట్టేట ముంచారు
- గొట్టిముక్కల వెంగళరావు



తన నివాసంలో మాట్లాడుతున్న గొట్టిముక్కల వెంగళరావు

కేపీహెచ్‌బీ కాలనీ, అక్టోబర్ 31 : తెలంగాణ రాష్ట్రంలో ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (పీసీసీ) నేతలు దొంగల ముఠాగా మారి.. రాష్ట్రాన్ని భాగాలుగా మార్చుకుని కోట్లాది రూపాయలకు ఎమ్మెల్యే సీట్లు అమ్ముకున్నారని.. అనాదిగా పార్టీకోసం కష్టపడి కోట్లాది రూపాయలు పోగొట్టుకున్న నేతలను నట్టేట ముంచారని కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన గొట్టిముక్కల వెంగళరావు ఆరోపించారు. కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీలో 42 ఏండ్ల కిందట సామాన్య కార్యకర్తగా చేరానని.. పీజేఆర్ అడుగుజాడల్లో నడుస్తూ యూత్ కాంగ్రెస్, టౌన్ కాంగ్రెస్ విభాగాల్లో పనిచేసి పార్టీని బలోపేతం చేశానన్నారు. ఈ క్రమంలోనే జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో కూకట్‌పల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బరిలో నిలిచి విజయం సాధించానని.. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించానన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం కోల్పోయినప్పుడు కూడా పార్టీని వదలకుండా పనిచేశానన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్, టీడీపీ పొత్తులో భాగంగా స్థానికేతరులైన టీడీపీ అభ్యర్థిని బరిలోకి దింపినా.. కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకు ఉమ్మడి అభ్యర్థి గెలుపు కోసం పని చేశానన్నారు. అనంతరం జరిగిన జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో పార్టీకి బలం లేకపోయినా పార్టీ అధిష్ఠానం సహకారం లేకున్నా డాక్టరైన తన కొడుకు విశ్వతేజరావును బరిలోకి దింపి పార్టీ ఓటు బ్యాంకును కాపాడేందుకు కృషి చేసినట్లు తెలిపారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి కోసం.. ఆదిలాబాద్‌లో నిర్వహించిన కాంగ్రెస్ సభ నుంచి ఇటీవల తుక్కుగూడలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ సమావేశాలకు నాలాంటి ఆశావహులంతా డబ్బులను ఖర్చు పెట్టి నాయకులను, కార్యకర్తలను తరలించి సభలను విజయవంతం చేసినట్లు తెలిపారు.

### టికెట్లకు బేరం పెట్టారు..

కాంగ్రెస్ బలోపేతం కోసం సొంత డబ్బులు ఖర్చుపెట్టి పనిచేసిన 75 శాతం నాయకులకు(ఆశావహులు) పీసీసీ అధ్యక్షుడు, సీనియర్ కాంగ్రెస్ నేతలు టికెట్లు ఇవ్వకుండా రోడ్డున పడేశారని ఆవేదన వ్యక్తం చేశారు. మీరంతా కలిసి ముఠాగా ఏర్పడి రాష్ట్రాన్ని భాగాలుగా చేసుకుని.. బిల్డర్లు, ఎన్‌ఆర్‌ఐలకు సీట్లను అమ్ముకున్నారని విమర్శించారు. ఈ ఎన్నికలు కూకట్‌పల్లి, శేరిలింగంపల్లిలో కాంగ్రెస్ పార్టీకి భంగపాటు తప్పదన్నారు.

### కాంగ్రెస్ చెంప చెళ్లుమనిపించేందుకే బీఆర్‌ఎస్‌లోకి..

కూకట్‌పల్లి నియోజకవర్గంలో ఏండ్ల తరబడి కాంగ్రెస్ పార్టీలో పనిచేసిన తనకు అన్యాయం జరిగిందని.. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పెద్దల చెంప చెళ్లుమనిపించేందుకే బీఆర్‌ఎస్ పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. బుధవారం సాయంత్రం కూకట్‌పల్లి చిత్తారమ్మ దేవాలయం నుంచి వెయ్యి మంది అనుచరులతో ర్యాలీగా తరలివెళ్లి సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌ల సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. రేపటి నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ఓడించడమే లక్ష్యంగా.. కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, శేరిలింగంపల్లిలో అరికెపూడి గాంధీ గెలుపు కోసం తన అనుచరులతో కలిసి పనిచేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్వతేజరావు, గురుమూర్తి, సంపత్‌రెడ్డి, బండారి ప్రవీణ్‌గౌడ్, రేష్మా, సంధ్యా, కల్పన, అశోక్ చారి, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

### నేడు బీఆర్‌ఎస్‌లో చేరనున్న గొట్టిముక్కల

కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ టికెట్ దక్కకపోవడంతో పార్టీకి రాజీనామా చేసిన గొట్టిముక్కల వెంగళరావు బీఆర్‌ఎస్ పార్టీలో చేరనున్నారు. బుధవారం సాయంత్రం కూకట్‌పల్లి చిత్తారమ్మ దేవాలయం నుంచి ప్రగతిభవన్ వరకు భారీ ర్యాలీగా తరలివెళ్లి బీఆర్‌ఎస్ పార్టీ అధినేత, సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ సమక్షంలో గొట్టిముక్కల వెంగళరావు వెయ్యి మంది అనుచరులతో కలిసి బీఆర్‌ఎస్ పార్టీలో చేరనున్నారు. కూకట్‌పల్లి డివిజన్ కార్పొరేటర్‌గా పోటీ చేసిన విశ్వతేజరావుతో పాటు గురుమూర్తి, సంపత్‌రెడ్డి, బండారి ప్రవీణ్‌గౌడ్, రేష్మా, సంధ్య, కల్పన, అశోక్ చారి, ఉదయ్ తదితరులు బీఆర్‌ఎస్ పార్టీలో చేరనున్నారు.

# నామినేషన్ కేంద్రాల వద్ద 144 సెక్షన్

- సైబరాబాద్ సీపీ, స్టీఫెన్ రవీంద్ర

సిటీబ్యూరో, అక్టోబర్ 31 (నమస్తే తెలంగాణ): అసెంబ్లీ ఎన్నికల నామినేషన్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధిస్తున్నట్లు సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర ఉత్తర్వులు జారీ చేశారు. 3వ తేదీ నుంచి నామినేషన్ల ప్రక్రియ మొదలై 10వ తేదీ ముగుస్తుంది. 15వ తేదీ వరకు విత్‌డ్రాలకు అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో నవంబర్ 3 నుంచి 15వ తేదీ వరకు సైబరాబాద్‌లోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల నామినేషన్ల కేంద్రాల వద్ద ఆంక్షలు విధిస్తున్నట్లు తెలిపారు.

| నియోజకవర్గం | నామినేషన్ కేంద్రం |
|---|---|
| రాజేంద్రనగర్ (51) | ఆర్డీఓ కార్యాలయం, రాజేంద్రనగర్ |
| శేరిలింగంపల్లి(52) | జీహెచ్‌ఎంసీ జోనల్ ఆఫీస్, శేరిలింగంపల్లి |
| చేవెళ్ల(53) | ఆర్డీఓ ఆఫీస్, చేవెళ్ల |
| షాద్‌నగర్(84) | ఆర్డీఓ ఆఫీస్, షాద్‌నగర్ |
| కుత్బుల్లాపూర్(45) | డీసీ, సర్కిల్-25, జీహెచ్‌ఎంసీ ఆఫీస్, కుత్బుల్లాపూర్ |
| కూకట్‌పల్లి(46) | డీసీ, మూసాపేట సర్కిల్, జీహెచ్‌ఎంసీ ఆఫీస్ |

## పటాకుల దుకాణాల లైసెన్స్‌లకు దరఖాస్తులు

- సైబరాబాద్ సీపీ, స్టీఫెన్ రవీంద్ర

సిటీబ్యూరో, అక్టోబర్ 31 (నమస్తే తెలంగాణ): దీపావళి సందర్భంగా పటాకుల విక్రయాల కోసం తాత్కాలిక లైసెన్స్‌లు కావాలనుకునే వారు ఈ నెల 5వ తేదీ వరకు ఆయా జోన్ డీసీపీలకు దరఖాస్తు చేసుకోవాలని సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర తెలిపారు. దరఖాస్తుతో పాటు అగ్నిమాపక శాఖ నుంచి ఎన్‌ఓసీ, ప్రభుత్వ స్థలమైతే జీహెచ్‌ఎంసీ, ఇతర శాఖల నుంచి అనుమతి, ప్రైవేట్ స్థలమైతే యజమానితో అగ్రిమెంట్ లేదా ఎన్‌ఓసీ తీసుకోవాలన్నారు. గత ఏడాది తీసుకున్న అనుమతి కాపీ ఉంటే ఆ కాపీని దరఖాస్తుతో జత చేయాలన్నారు. దరఖాస్తుతో సంబంధిత పత్రాలు, దుకాణం బ్లూ ప్రింట్ (ప్లాన్)ను జత చేస్తూ.. నాంపల్లి, గృహకల్పలోని ఎస్‌బీఐ బ్రాంచ్‌లో రూ. 600 చలాన్ రుసుమును చెల్లించాలని సీపీ సూచించారు.




## మహిళలను వేధిస్తే కఠిన చర్యలు

- డీసీపీ ఉషా విశ్వనాథ్

సిటీబ్యూరో, అక్టోబర్ 31 (నమస్తే తెలంగాణ): పదిహేను రోజుల్లో 66 మంది ఆకతాయిలను పట్టుకున్నామని, మహిళలు భయపడకుండా నిర్భయంగా షీ టీమ్స్‌కు ఫిర్యాదు చేయాలని రాచకొండ మహిళా సేఫ్టీ డీసీపీ ఉషా విశ్వనాథ్ అన్నారు. బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, మెట్రో స్టేషన్లు, విద్యా సంస్థలు, బహిరంగ ప్రదేశాలు, రద్దీ ప్రాంతాలలో డెకాయి ఆపరేషన్లు చేపట్టడంతో పాటు షీ టీమ్స్‌కు వచ్చిన ఫిర్యాదులపై తక్షణమే స్పందించి, వాటి తీవ్రతను బట్టి కేసులు నమోదు చేస్తున్నామన్నారు. ఇటీవల పట్టుబడ్డ 66 మందిలో 34 మంది మేజర్లు, 32 మంది మైనర్లు ఉన్నారని పేర్కొన్నారు. మంగళవారం ఎల్బీనగర్ ఉమెన్ సేఫ్టీవింగ్ కార్యాలయంలో భూమిక ఉమెన్స్ కలెక్టివ్ సంస్థ ఆధ్వర్యంలో పట్టుబడ్డ వారికి వారి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ.. మహిళల పట్ల గౌరవంగా ఉండాలని యువతకు సూచించారు. ఈ సందర్భంగా కొన్ని ప్రధాన కేసుల గూర్చి వివరించారు. బోడుప్పల్‌లో ఓ మహిళా డాక్టర్‌ను ప్రేమించాలంటూ నిందితుడు వెంటపడ్డాడు. ఆమె పనిచేసే చోటకు వెళ్లి ఆమెపై దాడి చేయడంతో అరెస్టు చేశామన్నారు. మరో కేసులో.. ఇంటర్ చదువుతున్న ఓ యువతిని వేధింపులకు గురిచేస్తున్న నిందితుడిపై కేసులు నమోదు చేశామన్నారు. ఈ సమావేశంలో ఏసీపీ వెంకటేశం, ఇన్‌స్పెక్టర్ పరశురాం, అడ్మిన్ ఎస్సై రాజు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

## ఏక్తా దివస్ సందర్భంగా సచివాలయంలో ప్రతిజ్ఞ

హైదరాబాద్, అక్టోబరు 31 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రీయ ఏక్తా దివస్ సందర్భంగా సచివాలయంలో అధికారులు, ఉద్యోగుల చేత ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ప్రతిజ్ఞ చేయించారు. దేశ మొదటి హోంశాఖ మంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా ప్రభుత్వం రాష్ట్రీయ ఏక్తా దివస్ పాటిస్తున్నది. ఈ సందర్భంగా మంగళవారం సచివాలయంలో ఉద్యోగుల చేత సీఎస్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డీజీపీ అంజనీ కుమార్, హోం శాఖ ముఖ్య కార్యదర్శి జితేందర్, జీఏడీ కార్యదర్శి శేషాద్రి, ప్రభుత్వ స్పెషల్ సెక్రటరీ, ఐ అండ్ పీఆర్ కమిషనర్ కె.అశోక్ రెడ్డి పాల్గొన్నారు.



## చందానగర్‌లో రూ.69 లక్షల నగదు స్వాధీనం

కొండాపూర్ : చందానగర్ పోలీసులు, మాదాపూర్ జోన్ ఎస్‌ఓటీ బృందం కలిసి చందానగర్ బస్‌స్టాప్ ప్రాంతంలో నిర్వహించిన వాహన తనిఖీల్లో పరస బాలకృష్ణ (35) వద్ద రూ.69 లక్షలు లభించాయి. సరైన పత్రాలు లేకుండా నగదు తరలిస్తున్నాడని, సీజ్ చేసిన నగదును ఆదాయపన్ను శాఖకు అప్పగించినట్టు చందానగర్ పోలీసులు తెలిపారు.

### ఆర్కేపురం చెక్‌పోస్టు వద్ద..

**నేరేడ్‌మెట్ :** నేరేడ్‌మెట్ పోలీసులు మంగళవారం ఆర్కేపురం చెక్‌పోస్ట్ వద్ద నిర్వహించిన వాహనాల తనిఖీల్లో కారులో వెళ్తున్న ఓ వ్యక్తి వద్ద నుంచి రూ.1.5 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. నగదుకు సంబంధించిన ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో సీజ్ చేసినట్టు ఇన్‌స్పెక్టర్ శివకుమార్ తెలిపారు.

### ఆసిఫ్‌నగర్ డివిజన్‌లో..

**మెహిదీపట్నం:** ఆసిఫ్‌నగర్ పోలీస్ డివిజన్ ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి నేతృత్వంలో పోలీసులు వాహనాల తనిఖీలను చేపట్టారు. ఆసిఫ్‌నగర్ క్రాస్ రోడ్‌లో జేబాబాగ్‌కు చెందిన అబ్దుల్ సలీం అనుమానాస్పదంగా వెళ్తుండగా అతడిని పోలీసులు ఆపి తనిఖీలు చేశారు. అతడి వద్ద రూ. 2 లక్షల 17 వేలు లభించాయి. అదే విధంగా.. మల్లేపల్లి ప్రియా థియేటర్ వద్ద వాహనాల తనిఖీల్లో ఆగాపురాకు చెందిన జమీర్ అలీ వద్ద రూ. రెండు లక్షలు హుమాయూన్‌నగర్ పోలీసులు పట్టుకున్నారు.

## రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ : డీసీపీ సాయి చైతన్య

చార్మినార్, అక్టోబర్ 31: ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణ కోసం చర్యలు తీసుకుంటున్నామని దక్షిణ మండల డీసీపీ సాయి చైతన్య తెలిపారు. ఈ సందర్భంగా రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్నట్టు తెలిపారు. మంగళవారం కామాటిపుర పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎస్‌వీ నగర్, పార్ధీవాడ ప్రాంతాల్లో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ దాడుల్లో సరైన పత్రాలు లేని 27 ద్విచక్ర వాహనాలతో పాటు ఓ ఆటోను సీజ్ చేశారు. అనంతరం డీసీపీ సాయిచైతన్య మాట్లాడుతూ.. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో దక్షిణ మండలంలోని కీలక ప్రాంతాల్లో సోదాలు నిర్వహిస్తున్నామన్నారు. పార్ధీవాడలో నిర్వహించిన కార్డెన్ సెర్చ్‌లో పలువురు రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. తనిఖీల్లో అడిషనల్ డీసీపీ షేక్ జహంగీర్, ఏసీపీలు రుద్రభాస్కర్, రమేశ్‌తోపాటు పలువురు ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

బాలానగర్, అక్టోబర్ 31 : రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన బాలానగర్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ కె.భాస్కర్ కథనం ప్రకారం.. బాలానగర్ నివాసి రాళ్లబండి శ్రీనివాస్ (60) లాడ్జిలో పనిచేస్తున్నాడు. మంగళవారం ఉదయం బాలానగర్ నుంచి బోయిన్‌పల్లి వైపు నడుచుకుంటూ వెళ్తుండగా.. హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్‌ఏఎల్) కంపెనీ వద్ద వెనుక నుంచి వచ్చిన వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో శ్రీనివాస్‌కు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం అతడిని గాంధీ దవాఖానకు తరలించారు. వైద్యులు పరీక్షించి శ్రీనివాస్ మృతి చెందినట్లుగా తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

## ముగిసిన నానల్ నగర్ భూముల కుంభకోణం కేసు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: హైదరాబాద్ నగరంలోని నానల్ నగర్ భూములకు సంబంధించిన ఎన్‌ఓసీ కుంభకోణంపై శాఖాపరమైన విచారణ ముగిసిందని, కమిటీ తన నివేదికను రాష్ట్రానికి అందజేసిందని రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం హైకోర్టుకు తెలియజేసింది. ఈ కేసులో అవకతవకలకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న రాష్ట్ర రెవెన్యూ శాఖ కార్యదర్శి నవీన్ మిట్టల్‌తో పాటు ఇతరులపై దాఖలైన పిటిషన్లను విచారిస్తున్న చీఫ్ జస్టిస్ అలోక్ ఆరాధే, జస్టిస్ ఎన్వీ శ్రావణ్ కుమార్‌లతో కూడిన ధర్మాసనం మంగళవారం విచారణ జరిపింది. రాష్ట్ర ప్రత్యేక న్యాయవాది హరేందర్ పరిషద్ వాదనలు వినిపించారు. ఆ నివేదికను తాము పరిశీలిస్తామని, ఈలోగా ప్రభుత్వం తీసుకునే చర్యలు తెలియజేయాలని ధర్మాసనం పేర్కొంది. తమకు చెందిన ఐదెకరాల భూమిపై సంబంధం లేని థర్డ్ పార్టీలకు ఎన్‌ఓసీ ఇచ్చారని పేర్కొంటూ.. నవీన్ మిట్టల్ పై ఫిర్యాదు చేసిన బాధితురాలు 85 ఏళ్ల శాంతి అగర్వాల్ తరపున సీనియర్ న్యాయవాది జె. ప్రభాకర్ వాదించారు. ఈ కుంభకోణంలో మరో ఐదుగురు అధికారులు ఉన్నారని తెలిపారు. వారిపై ప్రభుత్వం తీసుకున్న చర్యలను వివరించాలని ధర్మాసనం కోరింది. విచారణను నవంబర్ 14వ తేదీకి వాయిదా వేసింది.